
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

సోమవారం 5 ఆగస్టు 2024



గరిష్ఠం 29.5
కనిష్ఠం 24.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	576.10 (271.9007)	4,27,711	37,873
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.86 (3.66)	56.93	536.13
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	127.62 (5.90)	25,637	10,267

చికెన్ ధరలు | లైవ్ : రూ.103 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.170

బకాయిలు వసూలు చేయండి



- అధికారుల నిర్లక్ష్యంపై ఆడిట్‌శాఖ కొరడా
- నార్కట్‌పల్లి పశువులసంత కాంట్రాక్టర్, చెర్వుగట్టు కొబ్బరికాయల కాంట్రాక్టర్ల బకాయిల ప్రస్తావన
- చిట్యాల, చండూరు మార్కెట్లకు అద్దె బకాయిలు వసూలు చేయాలని ఆదేశం
- హాలియా మార్కెట్‌లో ఓ ఉద్యోగికి రెండు డీఏలపై నిలదీత
- 2020-21 ఆర్థిక సంవత్సరానికి స్థానిక సంస్థల ఆడిట్ నివేదిక బహిర్గతం
- ఆదాయపు పన్ను చెల్లించని నల్లగొండ గ్రంథాలయ అద్దె కారు యజమాని

స్థానిక సంస్థలకు రావాల్సిన బకాయిలను వసూలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ఆడిట్‌శాఖ బట్టబయలు చేసింది. స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో దుర్వినియోగమైన నిధులు, పేరుకుపోయిన బకాయిలు, అధిక ఖర్చులు, అక్రమాలను ఆడిట్‌శాఖ తన నివేదికలో వెల్లడించింది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

జిల్లాలో 2020-21 సంవత్సరానికి స్థానిక సంస్థలకు సంబంధించి నిర్వహించిన ఆడిట్ నివేదికను తాజాగా రాష్ట్ర ఆడిట్‌శాఖ విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలో నార్కట్‌పల్లి పశువుల సంత, చెర్వుగట్టు కొబ్బరికాయల వేలం కాంట్రాక్టర్ల బకాయిలను ఆడిట్‌లో గుర్తించింది. అదేవిధంగా చిట్యాల, చండూరు మార్కెట్ కమిటీలకు పౌర సరఫరాలశాఖ ఇతర సంస్థల నుంచి రావాల్సిన బకాయిల వసూలకు ఆదేశించింది. హాలియా మార్కెట్‌లో ఒక ఉద్యోగికి రెండు డీఏలు చెల్లించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. నల్లగొండ జిల్లా గ్రంథాలయసంస్థ కారు కాంట్రాక్టర్ ఆదాయపు పన్ను చెల్లించని విషయాన్ని కూడా పట్టుకున్న ఆడిట్‌శాఖ స్పష్టమైన ఆదేశాలిస్తూ నివేదికను వెల్లడించింది.

నార్కట్‌పల్లి పశువుల సంతకు రూ.2.16లక్షలు బకాయి

నార్కట్‌పల్లి గ్రామపంచాయతీకి సంబంధించి 2020-2021 సంవత్సరానికి పశువుల సంత కాంట్రాక్ట్‌ను జి.రమేష్ అత్యధికంగా రూ.26,01,00 బిడ్డింగ్‌తో కాంట్రాక్ట్ పొందాడు. కాలపరిమితి ముగిసేంతవరకు రూ.23,84,250 మాత్రమే పంచాయతీకి చెల్లించగా, రూ.2,16,750 బకాయి ఉన్నట్లు ఆడిట్‌శాఖ గుర్తించింది. సదరు కాంట్రాక్టర్ నుంచి సంబంధిత మొత్తాన్ని తక్షణమే రికవరీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆడిట్ శాఖ ప్రభుత్వానికి సూచించింది. సదరు కాంట్రాక్టర్ నెలనెలా పంచాయతీకి చెల్లించాల్సిన బకాయిలను పాలకవర్గం, ఉద్యోగులతో కుమ్మక్కు కావడంతో పాటు, కీలకమైన రాజకీయ నేత అండదండలుండడంతోనే చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

చిట్యాల ఏఎంసీకి పౌరసరఫరాలశాఖ బకాయి రూ.25.54లక్షలు

చిట్యాల వ్యవసాయ మార్కెట్ (ఏఎంసీ) పరిధిలో ఉన్న గోదాములను 2021 ఏప్రిల్ వరకు అద్దెకు తీసుకున్న పౌరసరఫరాలశాఖ రూ.25,54,801 బకాయి పడిందని ఆడిట్ సంస్థ గుర్తించింది. ఈ బకాయిలను తక్షణమే వసూలు చేసి మార్కెట్ కమిటీకి జమచేయాలని ఆదేశించింది. అదేవిధంగా చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి గోదాములు, దుకాణాల అద్దెల రూపంలో 2020 మే నాటికి కాటన్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నుంచి రూ.2,97,480, సివిల్‌సప్లయిస్ కార్పొరేషన్ నుంచి రూ.60,060, మరో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ.11,350 కలిపి మొత్తం రూ.3,81,250 బకాయిలను తక్షణమే వసూలు చేయాలని ఆడిట్‌శాఖ నిర్దేశించింది.

హాలియా మార్కెట్‌లో ఒక ఉద్యోగికి రెండు డీఏలు

హాలియా మార్కెట్ కమిటీలో ఒక ఉద్యోగికి రూ.19,747 చొప్పున రెండు సార్లు డీఏలు చెల్లించారని, అందులో ఒక డీఏ చెల్లింపు అదనంగా జరిగిందని ఆడిట్‌శాఖ గుర్తించింది. ఈమొత్తాన్ని సదరు ఉద్యోగి వ్యక్తిగత ఖాతా నుంచి రికవరీ చేయాలని ఆదేశించింది.

చెర్వుగట్టు కొబ్బరికాయల కాంట్రాక్టర్ బకాయి రూ.4.70లక్షలు

చెర్వుగట్టు గ్రామపంచాయతీలో 2020 జనవరి 1వ తేదీ నుంచి 2021 డిసెంబరు 31వ తేదీ వరకు కొబ్బరికాయల విక్రయానికి సంబంధించిన వేలాన్ని దక్కించుకున్న సీ.శంకర్ రూ.33,20,000 గ్రామపంచాయతీకి చెల్లించాల్సి ఉండగా, అందులో రూ.28,50,000 మాత్రమే చెల్లించాడు. ఇంకా రూ.4,70,000 గ్రామపంచాయతీకి కాంట్రాక్టర్ బకాయి ఉన్న విషయాన్ని ఆడిట్‌శాఖ గుర్తించింది. ఈ మొత్తాన్ని తక్షణమే వసూలు చేసి గ్రామపంచాయతీకి జమచేయాల్సిందిగా ప్రభుత్వానికి సూచించింది. ఈ బకాయికి సంబంధించి కూడా రాజకీయ జోక్యంతోనే నిధులు పక్కదారి పట్టి ప్రభుత్వానికి జమకాలేదని, అందువల్లే ఈ బకాయి పేరుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు.

నల్లగొండ లైబ్రరీ అద్దె వాహనం టీడీఎస్ చెల్లించలేదని గుర్తింపు

నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్యదర్శి 2020-21లో రూ.5,94,000కు అద్దె వాహనాన్ని వినియోగించారు. ఆదాయపన్ను శాఖ నిబంధనల ప్రకారం రూ.30వేల విలువ దాటిన ఏ కాంట్రాక్ట్ అయినా కాంట్రాక్ట్ మొత్తంలో ఆదాయపన్నుశాఖకు రెండు శాతం టీడీఎస్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే వాహన కాంట్రాక్టర్ సదరు పన్ను చెల్లించలేదని ఆడిట్ సంస్థ గుర్తించింది. తక్షణమే సదరు కాంట్రాక్టర్ నుంచి రెండు శాతం అంటే రూ.11,880 వసూలు చేసి ఆదాయపన్నుశాఖకు టీడీఎస్ చెల్లించాలని ఆడిట్‌శాఖ ఆదేశించింది.



కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నిరుద్యోగుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 4: చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లాకేంద్రంలో నైపుణ్యాల అభివృద్ధి సంస్థను నిర్మిస్తున్నట్లు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న మునిసిపల్ పార్కులో న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 30మంది మహిళలకు ప్రతీక్‌ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్యాక్ ద్వారా చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రకాల శిక్షణ ఇవ్వనున్నామని, ప్రత్యేకించి టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఉచితం గా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మిసున్నామని, అది త్వరలోనే పూర్తవుతుందన్నారు. కుట్టుమిషన్ల ద్వారా శిక్షణ తీసుకున్న మహిళలు కష్టపడి పని చేస్తే రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదించుకోవచ్చని, దీనిద్వారా స్వయం ఉపాధి కలుగుతుందని, అంతేకాక వారి కాళ్లపై వారు నిలబడవచ్చన్నారు. చదువుకున్న యువత ఖాళీగా ఉండకుండా, ఏదో ఒక రంగంలో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని, తద్వారా కుటుంబాలకు అండగా నిలబడాలన్నారు. అంతకుముందు మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. దుప్పలపల్లికి చెందిన స్వాతి అనే యువతి గుండెజబ్బుతో బాధపడుతున్నానని, సహాయం చేయాలని కోరగా తక్షణమే మంత్రి స్పందించి ఆస్పత్రి ఖర్చులన్నీ తానే భరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పదో తరగతి చదివే సంతోషి రూపా అనే విద్యార్థిని తల్లిదండ్రులు చనిపోయి అనాథగా మిగలగా, ఉన్నత చదువుల కోసం మంత్రికి మొరపెట్టుకుంది. ఆమె చదువుకు అయ్యే ఖర్చులన్నీ తానే భరిస్తానని, దీంతోపాటు ఆమెను దత్తత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రవి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగర్ క్రస్ట్ గేట్ల ఎత్తివేత



- 8 గంటలకు క్రస్ట్‌గేట్లు ఎత్తనున్న ప్రాజెక్టు సీఈ
- ఆరు గేట్లు ఎత్తి 2లక్షల క్యూసెక్కుల విడుదల
- అప్రమత్తమైన అన్ని శాఖల అధికారులు

నాగార్జునసాగర్, ఆగస్టు 4: నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారటంతో సోమవారం ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. కృష్ణా బేసిన్‌లో సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండటంతో సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వారం రోజులుగా క్రస్ట్ గేట్ల నుంచి, జలవిద్యుత్ కేంద్రా ల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీం తో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువలో ఉంది. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భారీ వరద సాగర్‌కు వస్తోంది. దీంతో సోమవారం ఉదయం 8గంటలకు ఆరు క్రస్ట్ గేట్లను ఎత్తి సుమారు 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు సీఈ నాగేశ్వరరావు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.6070టీఎంసీలు) కాగా, శ్రీశైలానికి ఎగువ నుంచి 4,00,491 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 882.90 అడుగులకు (203.8907 టీఎంసీలుగా) చేరింది. శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 15 అడుగుల మేరకు ఎత్తి, కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 4,27,711 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు) కాగా, ఆదివారం సాయంత్రానికి 576.10 అడుగులు (271.9007టీఎంసీలు)గా నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5700 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 4613 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేయడం ద్వారా 26,040 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 37,873 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 4,27,711 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

అన్ని శాఖల అధికారులు అప్రమత్తం: సాగర్ క్రస్ట్ గేట్లను సోమవారం ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, మత్స్యశాఖ, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు ఎవరూ నదిలోకి దిగవద్దని పోలీసులు హెచ్చరించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని మత్స్యశాఖ అధికారులు సూచించారు. దయ్యాలగండి వద్ద సాగర్ బ్యాక్ వాటర్‌లోకి పర్యాటకులు ఎవరు దిగకుండా రోడ్డు వెంట గుంతలు తవ్వించారు. పర్యాటకుల రాక ఎక్కువైతే వాహనాలను కంకర మిల్లు వద్ద ఉన్న బైపాస్ రోడ్డునుంచి దారి మళ్లించనున్నారు. సాగర్ గేట్లు ఎత్తనున్న నేపథ్యంలో ప్రజలెవ్వరూ నదిలోకి స్నానానికి వెళ్లవద్దని, నదిలో యువకులు ఈత కొట్టేందుకు ప్రయత్నించవద్దని, అదేవిధంగా పశువులు, జీవాలను నదిలోకి తీసుకువెళ్లవద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.



సాగర్‌లో కృష్ణానదిలో విహరించి లాంచీ దిగుతున్న పర్యాటకులు

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్‌కు ఎగువనుంచి భారీగా వరద వస్తుడంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తి స్థాయికి చేరువలో ఉంది. దీంతో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఆదివారం సెలవుదినం కావడంతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. హిల్‌కాలనీ విజయ విహార్ వెనక ఉన్న లాంచీ స్టేషన్ నుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెండు లాంచీ ట్రిప్పులను జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు నడిపారు. అంతే కాకుండా సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనుపు, ఎత్తిపోతల, బుద్ధవనం, కొత్త వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది.

వైజాగ్‌కాలనీని సందర్శించే పర్యాటకులు జాగ్రత్త..

దేవరకొండ: నాగార్జునసాగర్‌కు భారీగా వరద వస్తుండటంతో కృష్ణానది పరివాహక ప్రాంతమైన నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో బ్యాక్ వాటర్ పెరిగింది. ఈ నేపథ్యంలో వైజాగ్‌కాలనీకి వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం 5గంటల తరువాత కృష్ణానదిలోకి వెళ్లవద్దని పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశా రు. విహారయాత్రకు వచ్చి ఈతరాకపోవడంతో కృష్ణానదిలో మునిగి ఏటా 10మంది వరకు మృత్యువాత పడుతున్నారు. దీంతో అప్రమత్తమైన పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు వైజాగ్‌కాలనీలో సీసీ కెమెరాలు, ప్రమాద హెచ్చరికల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి రెవెన్యూ బృందాల పర్యటన

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 4: రైతులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ బృందాలు నేడు మండలానికి రానున్నాయి. వివిధ రకాల భూసమస్యలు ఉన్నందున తిరుమలగిరి(సాగర్) మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ క్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఐదుగురు తహసీల్దార్లతో కూడిన 50 మంది రెవెన్యూ సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం చింతలపాలెం, నెల్లికల్, తునికినూతల, నాగార్జునపేట, తిమ్మాయిపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని వారి భూసమస్యకు కారణాలు తెలుసుకొని వారి వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా సమస్యలను పరిష్కరించనున్నారు. అదేవిధంగా రైతుల కాస్తు కబ్జాను నిర్ధారించేందుకు సత్వరమే సర్వే చేసేందుకు తగిన ఏర్పాట్లను చేసింది. అధికారుల బృందంలో వేములపల్లి, నిడమనూరు, దామరచర్ల, తిరుమలగిరి(సాగర్), తహసీల్దార్లు శ్రీనివాస్‌శర్మ, కృష్ణయ్య, జవహర్‌లాల్, అనిల్‌తోపాటు త్రిపురారం మండలానికి చెందిన డిప్యూటీ తహసీల్దార్ ఖాదర్ మోహినుద్దీన్ పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేయనున్నాయి. వీరికి సహకరించేందుకు ఒక్కో బృందంలో ఇద్దరు సర్వేయర్లు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇతర రెవెన్యూ సిబ్బందిని కేటాయించారు. రైతులు దరఖాస్తు ఫారంతోపాటు వారి వెంట భూసంబంధిత రికార్డులను తీసుకురావాలని సంబంధిత అధికారులు కోరారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ సి.నారాయణరెడ్డి


నల్లగొండ టౌన్, ఆగస్టు 4: జిల్లాలో ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి అవసరమైన అన్నిఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ఆదివారం ఆయన ఆర్డీవోలు, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి 9వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల్లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించేందుకు ఇదివరకే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మురుగు కాల్వలను శుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా, సంరక్షించడం అందరి బాధ్యత అన్నారు. డ్రైడే ఫ్రైడే, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, స్ప్రే చేయాలని, గ్రామపంచాయతీ, మునిసిపాలిటీ వాహనాలకు జీపీఎస్ మిషన్లు ఏర్పాటు చేయాలని, వారసత్వ, చారిత్రక కట్టడాలను సంరక్షించాలని ఆదేశించారు. సోమవారం ప్రారంభించే ప్రారంభ కార్యక్రమానికి ఆయా నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల్లో పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులందరినీ ఆహ్వానించాలని, ఏర్పాట్లన్నీ ఆదివారమే పూర్తి చేయాలని, ప్రత్యేకించి నియోజకవర్గ నోడల్ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ పథకం కూలీలు, యువత, విద్యార్థులు, ఆశ, అంగన్‌వాడీలు అందరినీ భాగస్వాములు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని, ఇందుకు మీడియాను సైతం భాగస్వామ్యం చేయాలన్నారు. కళాజాత ద్వారా ప్రజలకు ప్రచారం కల్పించాలన్నారు. 5 రోజులపాటు పూర్తి నిబద్ధతతో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ అధికారుల సేవలు తీసుకోవాలన్నారు. అన్ని స్థాయిలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీ. పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయానికి
నిబంధనల మేరకే భూమి

● నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేశాం
● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 4: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని నిబంధనల మేరకే ప్రభుత్వం భూమి కేటాయించిందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ఈ నెల 11వ తేదీ లోగా కూల్చాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించడంపై ఆయన మండిపడ్డారు. నిబంధనల మేరకే బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి ప్రభుత్వం ఎకరం భూమి కేటాయించిందన్నారు. కార్యాలయ నిర్మాణానికి మునిసిపల్ కార్యాలయంలో తాము అనాడే దరఖాస్తు చేశామన్నారు. కానీ, ఏ పార్టీ కార్యాలయానికి కూడా మునిసిపల్ అధికారులు గతంలో అనుమతులు మంజూరు చేయలేదన్న కారణంతో అప్పటి మునిసిపల్ అధికారులు కార్యాలయం నిర్మాణ అనుమతికి జాప్యం చేశారన్నారు. అయినా, నిబంధనల మేరకు 33 శాతం జరిమానా చెల్లిస్తామని తాము నెల రోజుల క్రితమే కలెక్టర్‌కు, మునిసిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా తెలియజేశామన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఏ పార్టీ కార్యాలయానికి కూడా మునిసిపల్ అధికారుల అనుమతులు లేవని, కొన్ని పార్టీ కార్యాలయలకు భూమికి సంబంధించిన పత్రాలు కూడా లేవన్నారు. కేవలం రాజకీయ కక్షతో, అధికార అహంకారంతో తమ పార్టీకి దేవాలయం లాంటి కార్యాలయాన్ని కూలగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇది ఎంత మాత్రం సమంజసం కాదని హితవు పలికారు. చేతనైతే మంత్రిగా రూ.2వేల కోట్ల నిధులు తెచ్చి నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేయాలని సవాల్ చేశారు.

చెర్వుగట్టుపై ఘనంగా లక్షపుష్పార్చన



చెర్వుగట్టు రామలింగేశ్వరుడికి లక్షపుష్పార్చన చేస్తున్న అర్చకులు, వేడుకలో పాల్గొన్న భక్తులు

ఆషాఢ చివరి అమావాస్య, ఆదివారం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 4: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి లక్ష పుష్పార్చన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం చివరి రోజు, ఆదివారం పుష్యమీ నక్షత్రం ఉండటంతో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత ప్రధానాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాలు, భక్తుల శివన్నామ స్మరణ నడుమ పల్లకీ సేవతో మహా మండపానికి చేర్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహార్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి చెంత పూజలందుకున్న పుష్పాలను స్వీకరించేందుకు భక్తులు పోటీపడ్డారు. బోనాలెత్తుకుని శివసత్తులు చేసిన సంప్రదాయ నృత్యాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఈవో సిరికొండ నవీన్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా చెర్వుగట్టు క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఎల్లారెడ్డిగూడెం ఆర్చి వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్టు, వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సత్రం చైర్మన్ రంగా శేఖర్, వైస్ చైర్మన్ మీలా సోమయ్య, ట్రస్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోపలాయపల్లి క్షేత్రంలో నేటి నుంచి మహాలింగార్చన: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని గోపలాయపల్లి గుట్టపై కొలువైన వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఈనెల 5 నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాసంలో పార్థివ (పుట్ట మట్టితో చేసిన శివలింగానికి) లింగార్చన వేడుకను వేద పాఠశాల ప్రిన్సిపాల్ చేబియ్యం రాఘవశర్మ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 7గంటల వరకు పార్థివ లింగాభిషేకం ఉంటుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



దర్వేశీపురం ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

కనగల్: మండలంలోని దర్వేశీపురం రేణుకా ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగింది. ఆషాఢమాసం, ఆదివారం అమవాస్య కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజల్లో పాల్గొని చీరసారె, ఒడిబియ్యం, బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. కోరికలు తీర్చాలని ముడుపులు కట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

వానొస్తే.. సెల్లార్లే
సెలయేర్లు
•7లో..

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి
సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి
•7లో..

యాదగిరికొండపై భక్తుల రద్దీ

ప్రత్యేక, ధర్మదర్శనాల్లో భక్తుల సందడి ● యాదగిరిగుట్ట ఆలయ ఈఈ సస్పెన్షన్

భువనగిరి అర్బన్, ఆగస్టు 4: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆదివారం యాదగిరికొండపై రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 20వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీగా కన్పించాయి. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద భక్తుల రద్దీ ఉండగా ఆలయ ఉత్తర దిశలో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. అదే విధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లుచేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.27,09,469 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు.

7వ తేదీన హుండీ కానుకల లెక్కింపు

లక్ష్మీనృసింహుడిని దర్శించుకునే భక్తులు సమర్పించే మొక్కు కానుకలను ఈ నెల 7వ తేదీన కొండకింద సత్యదేవుని వ్రత మండపంలో లెక్కించనున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.




నిత్య కల్యాణంలో భాగంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు, యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట తిరువీధుల్లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట ఆలయ ఈఈ రామారావు సస్పెన్షన్

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో ఎలక్ట్రికల్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఊడెపు వెంకటరామారావు ఆదివారం సస్పెండ్ ఆయ్యారు. ఆలయంలో ఈఎస్ఎం శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎలాంటి అనుమతులు లేకుండా 12మందిని నియమించారు. గతంలో వచ్చిన ఆరోపణలు, స్థానికంగా పలు ఫిర్యాదులు రావటంతో విచారణ చేపట్టిన ఈవో సస్పెండ్ చేశారు. ఈమేరకు సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డికి అదనంగా ఎలక్ట్రికల్ ఈఈగా బాధ్యతలు అప్పగించారు.

వానొస్తే.. సెల్లార్లే సెలయేర్లు

దేశ రాజధాని ఢిల్లీలో సెల్లార్‌లోకి వరదనీరు చేరి సివిల్స్‌కు శిక్షణ పొందుతున్న ముగ్గురు విద్యార్థులు మృతి చెందడంతో సెల్లార్ల వ్యవహారం అంతటా చర్చనీయాంశమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీల్లో నిబంధనలకు వ్యతిరేకంగా, అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని సెల్లార్లను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. వాహనాల పార్కింగ్ పేరిట నిర్మించిన సెల్లార్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. వర్షం వచ్చిందంటే నీరు చేరి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. అదేవిధంగా ఆరుబయట రహదారిపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో భారీ వర్షాలకు భువనగిరి పట్టణంలో నష్టం వాటిల్లినా వ్యాపారుల్లో, అధికారుల్లో మార్పు రాలేదు.

- వర్షం వచ్చిందంటే వరద నీరు చేరాల్సిందే
- పార్కింగ్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- చూసీ చూడనట్లుగా వదిలేస్తున్న అధికారులు
- అనుమతులు కొంత.. నిర్మాణాలు కొండంత



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 2021లో సర్వీస్ రోడ్డులో ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్ ఫొటో)

● ప్రమాదం చోటుచేసుకున్నా మారలే..

భువనగిరి టౌన్, ఆగస్టు 4 : వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న సెల్లార్లు భువనగిరి మునిసిపల్ పరిధిలో 20కి పైగా ఉండగా రెండింటికి మాత్రమే నిర్మాణ అనుమతులు ఉన్నాయి. మిగతావన్నీ అక్రమ నిర్మాణాలుగా ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు సెల్లార్లలోకి వరద నీరు చేరి అద్దెకుంటున్న వ్యాపారులకు రూ.లక్షల్లో నష్టం జరిగింది. కొన్ని సెల్లార్లలో వర్షపునీటి కారణంగా విద్యుదాఘాతం కూడా సంభవించింది. దీంతో చర్యల పేరిట అధికారులు భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. కాని నేటికీ సెల్లార్లలో ఎలాంటి మార్పులు రాకపోగా నూతనంగా నిర్మించిన సెల్లార్లు కూడా వ్యాపారాలకు అడ్డాగా మారాయి. సెల్లార్లలో నిర్వహించే వ్యాపారాల కోసం వచ్చే వారి వాహనాల పార్కింగ్‌తో కూడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో పాటు మునిసిపాలిటీకి ఆస్తిపన్ను, ట్రేడ్ పన్ను తదితర రూపకాల్లో నష్టం వాటిల్లుతోంది.

సెల్లార్లలో ఆసుపత్రి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ మెయిన్‌రోడ్డులోని సెల్లార్లలో ఆసుపత్రులు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే ఒక్కోసారి వరద నీరు సెల్లార్లలోకి వరద చేరే ప్రమాదం ఉంది. అయినా సెంటర్‌లోని సెల్లార్‌లో ఆసుపత్రిని ఏర్పాటుచేశారు. లింగగిరి రోడ్డులో ఎంటర్‌ప్రైజెస్, మెటల్ షాప్, మిర్యాలగూడ రోడ్డులోని సెల్లార్‌లో సెల్ షాప్, కొత్తబస్టాండ్ సమీపంలోని మరో రెండుసెల్లార్లలో మెకానిక్ షాపులు, మోటార్ షోరూంలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా ఏడు దుకాణాలను సెల్లార్లలో నిర్వహిస్తున్నారు. గతంలో సెల్లార్లలోని వరద నీరు వచ్చి చేరింది.

● కాగితాల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా

రామగిరి: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో పెద్దసంఖ్యలో అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వీటిలో సెట్‌బ్యాక్, ఫైర్‌వాహనం చుట్టూ తిరిగేలా స్థలం కేటాయించాల్సి ఉన్నా ఆ నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టానుసారంగా నిర్మించారు. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. కాగితాల్లో నిబంధనలు పాటిస్తున్నట్లు ఉన్నా, క్షేత్రస్థాయిలో అవేవీ కనిపించవు. పట్టణంలో సుమారు 500కు పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిలోని సెల్లార్ స్థలాన్ని కేవలం పార్కింగ్‌కి మాత్రమే ఉపయోగించాల్సి ఉండగా కొన్నిచోట్ల లైబ్రరీలు,ఫంక్షన్‌హాల్స్, ఆఫీస్‌రూంలు నిర్వహిస్తున్నారు. ప్రకాశంబజార్‌లోని కొన్నింటిలో ఆసుపత్రులు, ల్యాబ్‌లను ఏర్పాటుచేశారు. ఆసుపత్రులకు వచ్చే వారి వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. సెల్లార్‌లో వాహనం పెట్టే అవకాశం లేక రోడ్డుకు ఇరువైపులా పెట్టిన వాహనయజమానులకు పోలీసులు జరిమానా విధించిన సంఘటనలూ ఉన్నాయి. రెండేళ్ల కిందటి వరదలకు సెల్లార్లలోకి వరదనీరు చేరి అపార్ట్‌మెంట్ వాసులు మూడు రోజుల పాటు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా వరద నీటిని మోటార్లతో ఎత్తిపోయాల్సిన పరిస్థితి నెలకొంది. సెల్లార్‌లో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

> **నోటీసులు ఇస్తాం**
>
> సెల్లార్‌ను పార్కింగ్, జనరేటర్ ఏర్పాటుకోసం ఉపయోగించాలి. వ్యాపారాలు కాదు. అపార్ట్‌మెంట్లలోని సెల్లార్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు ఇస్తాం. అప్పటికీ స్పందించకపోతే చట్టరీత్య చర్య తీసుకుంటాం.
>
> \- సయ్యద్ ముసాబ్ అహ్మద్, కమిషనర్, నల్లగొండ



అమలుకాని నిబంధనలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణం వేగంగా విస్తరిస్తుండగా 48 వార్డుల్లో గృహాలతో పాటు వ్యాపారసముదాయాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణ జనాభా లక్షన్నరకు చేరుకోగా సుమారు 26వేలకు పైగా నిర్మాణాలున్నాయి. 2,207 గృహేతర భవనాలు, 1,592 మిశ్రమ భవానాలున్నట్లు అధికారులు తెలిపారు. అయితే మునిసిపల్ నిబంధనలు ఎక్కడా అమలు కావట్లేదు. భవన నిర్మాణాల అనుమతులు కాగితాలలో చూపేది ఒకటైతే క్షేత్రస్థాయిలో నిర్మాణాలు మరోరకంగా ఉంటున్నాయి. ప్రధానంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లలోని సెల్లార్లను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారు. సాగర్‌రోడ్‌లోని హనుమాన్‌పేట, రెడ్డీకాలనీ, నల్లగొండ రోడ్డులోని రాంచంద్రాగూడెం, రౌండ్‌చౌరస్తా, సీతారాంపురం, గుంటూరు రోడ్డులోని విద్యానగర్, హౌసింగ్‌బోర్డులలో నిర్మించిన బహుళ అంతస్తుల వ్యాపార సముదాయాల్లో నిబంధనలు పాటించిన నిర్మాణాలు ఒకటి, అర మాత్రమే. హనుమాన్‌పేట ప్రాంతంలో మురుగుకాల్వలను ఆక్రమించి కట్టిన దుకాణ సముదాయాల్లోని సెల్లార్లు వర్షాకాలంలో జలపాతాలను తలపిస్తుండగా, నల్లగొండ రోడ్డులోని సెల్లార్లు బావులను తలపిస్తున్నాయి. ఏడెనిమిదేళ్ల క్రితం రాజీవ్ చౌరస్తాలోని సెల్లార్‌లోకి వరద నీరు చేరితే మోటార్లతో నీటిని తోడేశారు. ఇక మూడేళ్ల క్రితం హనుమాన్‌పేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లోకి భారీగా వరద నీరు చేరగా వ్యాపారులకు నష్టం వాటిల్లింది.

● చౌటుప్పల్‌లో తలాపునే ప్రమాదం

చౌటుప్పల్ టౌన్:చౌటుప్పల్ పట్టణంలోని చెరువు కింది ప్రాంతాల్లోని సెల్లార్లు ప్రమాదకరంగా మారాయి. రెండు, మూడేళ్లలో ఐదు పర్యాయాలుగా వచ్చిన వరదలతో పాటు చెరువు అలుగు నీరు అనేక సెల్లార్లలోకి చేరి యజమానులు తీవ్రఇబ్బందులను ఎదుర్కొన్నారు. పట్టణంలో పైభాగంలో ఉన్న చెరువు నుంచి ఊట జలాలు సెల్లార్లలోకి రావడంతో యజమానులు అష్టకష్టాలు పడ్డారు. అనేక కుటుంబాలు ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాయి. సెల్లార్లలో నీరు నెలల తరబడి నిలిచి యజమానులకు తీవ్రనష్టాలను కలిగించింది. సెల్లార్లలోని నీటిని తోడేందుకు అగ్నిమాపక వాహనాలను ఉపయోగించారు. వరద తగ్గిన తర్వాత కూడా ఐదారు నెలల పాటు సెల్లార్లలో ఊట నీరు చేరింది. వాటిని మోటార్లసాయంతో బయటకు పంపించారు.

రహదారికి ఇరువైపులా

చౌటుప్పల్‌లో ప్లాట్ల ధరలు పెరగడంతో యజమానులు అండర్ గ్రౌండ్(సెల్లార్) నిర్మాణాలపై దృష్టి సారించారు. జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లతో పాటు తంగడపల్లి రోడ్డు, లింగారెడ్డిగూడెం రోడ్డు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ రోడ్డు, హ్యాండ్లూమ్ మార్కెట్ రోడ్డు, చిన్నకొండూరు రోడ్డులలో సెల్లార్ నిర్మాణాలు చేపట్టారు. ఆయా రోడ్లలో 156మడిగెలకు అండర్ గ్రౌండ్ నిర్మాణాలు ఉండగా, వీటిలో 10కి పైగా నివాసగృహాలు ఉన్నాయి. రెండు పేరొందిన కమర్షియల్ కాంప్లెక్స్‌లో సెల్లార్లను పార్కింగ్‌కు కేటాయించగా, ఓ సొంత భవనంలోని సెల్లార్‌లో ఓ పార్టీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.

● అత్యధికంగా అనుమతుల్లేనివే?

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణ పరిధిలో సెల్లార్ల నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అత్యధికంగా అనుమతుల్లేకుండా ఏర్పాటు చేయడంతో పాటు అందులో చిరువ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. కనీస జాగ్రత్తలు పాటించడంలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. సూర్యాపేట పరిధిలో 48వార్డులు ఉండగా 37,500 గృహాలు ఉన్నాయి. ముఖ్యంగా కుడకుడ ప్రాంతంలో, వాణిజ్యభవన్, ఎంజీ రోడ్డు, తాళ్లగడ్డ, అయ్యప్పనగర్, కలెక్టరేట్ ప్రాంతంతో పాటు వివిధ రకాల వ్యాపార సముదాయాల ప్రాంతంలో నూతన భవనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సెల్లార్లు ఉన్న భవనాలు 110కి పైగా అనుమతులు తీసుకోకుండా నిర్మించినవే ఉన్నాయి. ఇటీవల జాతీయ రహదారి వెంట నూతనంగా 10కి పైగా ప్రముఖ వస్త్ర, వ్యాపార షాపింగ్‌మాల్ నెలకొల్పారు. వీటికి సెల్లార్లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని పార్కింగ్‌కు వినియోగిస్తున్నా కొన్ని మాత్రం పార్కింగ్‌తో పాటు వ్యాపార అవసరాలకు వాడుకుంటున్నారు.

దేవరకొండ : దేవరకొండ మునిసిపాలిటీలోని కొన్ని షాపింగ్ కాంప్లెక్స్‌ల సెల్లార్లలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. పట్టణ పరిధిలో 20 వార్డులు ఉండగా 55వేల జనాభా నివసిస్తోంది. 952 వాణిజ్య దుకాణాల సముదాయాలు ఉండగా ఐదు సెల్లార్లు ఉన్నాయి. సెల్లార్లలో కారు పార్కింగ్, వాహనాలు నిలుపుకోవడంతో పాటు దుకాణాలు ఏర్పాటుచేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. సెల్లార్లలో ప్రమాదాలు జరిగితే ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. సెల్లార్లలో అగ్నిమాపక వాహనం తిరిగేలా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రైలుకు ఎదురువెళ్లి విద్యార్థి బలవన్మరణం



బొల్లెద్దు చందు (ఫైల్ ఫొటో)

నల్లగొండ క్రైం, ఆగస్టు 4: వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం శేషమ్మగూడెం గ్రామానికి చెందిన బొల్లెద్దు నగేష్-సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు భాను ఇటీవల డిగ్రీ పూర్తి చేయగా, చిన్న కుమారుడు బొల్లెద్దు చందు (20) నల్లగొండ ఎన్జీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. పార్ట్ టైమ్‌గా పనిచేసే ఆఫీసుకు వెళ్తున్నానని శనివారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిన చందు రాత్రి అయినా రాకపోవడం, ఫోన్ ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులను ఆరాతీయగా ఆచూకీ లభించలేదు. ఆదివారం తెల్లవారుజామున దుప్పలపల్లి బైపాస్ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై ఛిద్రమైన మృతదేహంతో పాటు అక్కడున్న వస్తువులను స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ద్విచక్రవాహనంతో పాటు సెల్‌ఫోన్ ఆధారంగా చందు మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో రైల్వేట్రాక్ వద్దకు వచ్చిన చందు తన ద్విచక్ర వాహనాన్ని సమీపంలో నిలిపి వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగావెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. రైలు ఢీకొనడంతో మృతదేహం ఛిద్రంకాగా, నల్లగొండ జిల్లా కేంద్రాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. రాయినిగూడెం రైల్వేస్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపారు. చందు ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ ముమ్మరం చేశారు.

ఎదిగివచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అశ్రునయనాల నడుమ చందు అంత్యక్రియలు నిర్వహించారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గట్టుప్పల్, ఆగస్టు 4 : చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ వర్కాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు అలె భాస్కర్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. కష్టకాలంలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేనతే కార్మికులకు రుణ సహాయాన్ని అందించాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చా సుధాకర్‌రావు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, నల్లగొండ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, చేనేత సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్ ఎన్నం శివకుమార్, కోమటి వీరేశం, రాపోలు గోపీనాథ్, చిలువేరు దుర్గయ్య, రావుల ఎల్లప్ప, నరేందర్, నామని దత్తత్రి, కొంగరి పాండు, రాపోలు మారుకొండయ్య, తిరం దాసు చంద్రమౌళి, జంగయ్య, ఆంజనేయులు, కర్నాటి ప్రవీణ్, శంకర్, వెంకటేశం, కర్నాటి రవితేజ, శ్రీకాంత్, శివశంకర్, బీజేపీ, యువ మోర్చా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



గట్టుప్పల్‌లో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు వర్షిత్‌రెడ్డి, శ్రీనివాస్

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి

మర్రిగూడ, ఆగస్టు 4 : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ నెల 9న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక ఫ్లోరిన్ ఈ ప్రాంతంలోనే ఉందని, దీంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సాగునీరు లేకపోవడంతో భూములు బీళ్లుగా మారాయన్నారు. ప్రాజెక్టు పూర్తి కోసం సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో ప్రాజెక్టుల పరిశీలన చేశామని, ఈ నెల 9న నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగే సదస్సుకు పెద్దఎత్తున ప్రజలు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, మర్రిగూడ మండల కార్యదర్శి వేర్పుల యాదయ్య, నాంపల్లి మండల కార్యదర్శి చంద్రమౌళి, సీపీఎం నాయకులు బొట్టు శివకుమార్, ఖైల సత్తయ్య, కొమ్ము లక్ష్మయ్య, నీలకంఠ రాములు, కొట్టం యాదయ్య, దామెర లక్ష్మి, మల్లెటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, సీపీఎం నాయకులు

కొండమల్లేపల్లి: డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని కోరుతూ ఈ నెల 9న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. సమావేశంలో చింతపల్లి మండల కార్యదర్శి ఉడుగుండ్ల రాములు, ఎల్లయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే

పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

చండూరు, ఆగస్టు 4 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం నకిరేకల్ పట్టణంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 38వ షొటోఖాన్ జాతీయ పోటీల్లో చండూరుకు చెందిన 10 ఏళ్ల లోపు విద్యార్థులు కాంస్య పతకాలు గెలుపొందారు. గీతా విద్యాలయానికి చెందిన సంకోజు సాయిప్రణయ్, సంకోజు మణిదీప్, కారింగు అభిరామ్, కృష్ణవేణి విద్యాలయానికి చెందిన ఇరిగి భానుతేజలు ఈ పతకాలు సాధించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే వేముల వీరేశం మెడల్స్‌ను అందజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ కారింగు రవికి ఎమ్మెల్యే మెమోంటో అందజేసి, అభినందించారు. విద్యార్థులు పతకాలు సాధించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాస్టర్స్ రాపోలు సుదర్శన్, అంతటి సోములుగౌడ్, నగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాంస్య పతకాలతో విద్యార్థులు

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఆగస్టు 4 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని లక్ష్మీనృసింహుని క్షేత్రంలో స్వామి వారి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణల అనంతరం ఆరెపత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమలు చేపట్టారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహార్నివేదనలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నరికొండ నవీన్, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

లారీని ఢీకొన్న కారు : ఒకరి మృతి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 4 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. సీఐ అశోక్‌రెడ్డి ఆదివారం తెలిపిన వివరాలు ప్రకారం ఖమ్మం జిల్లా వైరా నుంచి పదిమల వీరభద్రరావు(68) ఆయన కుమారుడు జగదీష్, బంధువు నితీష్‌కుమార్ కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. లింగోజిగూడెం వద్దకు రాగానే కారు ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో పదిమల వీరభద్రరావు మృతి చెందగా, జగదీష్, నితీష్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీ

- డ్రైవర్లకు తీవ్రగాయాలు
- క్యాబిన్‌లో ఇరక్కున్న డీసీఎం డ్రైవర్
- అతికష్టం మీద బయటికి లాగిన పోలీసులు



దెబ్బతిన్న వాహనాలు, రాకపోకలను పునరుద్ధరిస్తున్న పోలీసులు

కనగల్, ఆగస్టు 4 : నల్లగొండ జిల్లా కనగల్ మండం జీ చెన్నారం సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు డీసీఎం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరు వాహనాల డ్రైవర్లు తీవ్రగాయాల పాలయ్యారు. కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోగా, గంట పాటు శ్రమించి డీసీఎం డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ నుంచి చండూరుకు నైట్‌హాల్ట్ బస్సు కనగల్ మీదుగా వెళుతోంది. మండలంలోని నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై జీచెన్నారం స్టేజీ సమీపంలో ఎదురుగా నల్లగొండకు వైపు వస్తున్న డీసీఎం ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో వాహనాల ముందుభాగాలు నుజ్జునుజ్జు కాగా ఇరువురు డ్రైవర్లు క్యాబిన్లలో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బస్సు డ్రైవర్‌ను త్వరగానే బయటికి లాగి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటిలోగా ఎస్ఐ విష్ణుమూర్తి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీసీఎం క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను గంటపాటు కష్టపడి బయటకు తీశారు. అనంతరం చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. అంతసేపు రక్తమోడుతూ డ్రైవర్లు నరకయాతన అనుభవించారు. బస్సు డ్రైవర్ కనగల్ మండలం దోరెపల్లి గ్రామానికి చెందిన ఎరుకల బిక్షంగా గుర్తించారు. ఇదిలా ఉండగా బస్సులోని నలుగురికి ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. వారు కూడా 108 వాహనంలో నల్లగొండలోని ఆసుపత్రికి వెళ్లారు. మిగతా ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో చండూరుకు వెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

రూ.88 వేలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

మోత్కూరు, ఆగస్టు 4 : సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా పలువురు సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటూనే ఉన్నారు. క్రెడిట్ కార్డుదారుడి నుంచి రూ.88 వేలు కొల్లగొట్టిన సంఘటన ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో వెలుగులోకి వచ్చింది. మోత్కూరుకు చెందిన వ్యాపారి క్రెడిట్‌కార్డ్ ఉపయోగిస్తున్నాడు. అతడికి ఇటీవల పలు మెస్సేజీలు రాగా వాటికి సమాధానం ఇచ్చాడు. గత నెల(జూలై) 15కు ముందు ఒకసారి రూ.40 వేలు, ఆ తర్వాత 15న మరోసారి రూ.48 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. అది గమనించని సదరు వ్యాపారి తన క్రెడిట్ కార్డ్ సక్రమంగా పనిచేయడం లేదంటూ మూడు రోజుల క్రితం క్రెడిట్‌కార్డులు ఇచ్చే వ్యక్తికి చూపించాడు. అతడు కార్డు ద్వారా రూ.88 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారని ఆ వ్యాపారికి చెప్పి, ఆ కార్డు బ్లాక్ చేసి కొత్త కార్డు ఇచ్చాడు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

స్నేహితుడిపై దాడిని అడ్డుకోబోయి గాయాలు

హుజూర్‌నగర్, ఆగస్టు 4 : స్నేహితుడిపై కత్తితో దాడిని అడ్డుకోబోయిన ఓ వ్యక్తి గాయాలపాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూరుగడ్డ గ్రామానికి చెందిన చింతా నవీన్, నేరేడుచర్లకు చెందిన యడవెల్లి వరుణ్‌కు పాతకక్షలు ఉన్నాయి. మధ్యాహ్నం పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు ఇందిరాసెంటర్‌లో ఉన్న రమ్మని నవీన్‌కు వరుణ్ ఫోన్ చేశాడు. తన స్నేహితులతో నవీన్ అక్కడికి వెళ్లగా వరుణ్ తన బైక్‌తో ఢీకొట్టి వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌పై దాడి చేశాడు. అడ్డుకోబోయిన గోపాలదాసు కిరణ్‌ను కూడా దాడిచేసి గాయపర్చాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దాడిలో గాయపడ్డ నవీన్, కిరణ్‌లు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


మొక్క నాటుతున్న మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ, ఆగస్టు 4: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైష్ణవీ ఫుడ్ ప్రొడక్ట్స్ యాజమాన్యం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైస్‌మిల్లుల యజమానులు లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పట్టణం చుట్టూ పరిశ్రమలు విస్తరించినందున కాలుష్య నివారణతో పాటు, సమీపంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ వల్ల ఉత్పన్నమయ్యే మరికొంత వేడిని నుంచి కాపాడుకోవడానికి మొక్కలను నాటి సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కర్నాటి రమేష్, అసోసియేషన్ నాయకులు రేపాల మధుసూదన్, బండారు కుశలయ్య, బాబ్జి, వైష్ణవీ ఫుడ్ ప్రొడక్ట్స్ యాజమాన్యం, బీఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి : టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నల్లగొండటౌన్, ఆగస్టు 4: నల్లగొండ పట్టణంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలోని రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఓపెన్ డ్రైన్, శానిటేషన్ విషయంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. అంతేకాక మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పలు శ్మశానవాటికలో నీటి కొరత, బాత్రూంలను సరిచేయాలన్నారు. దోమల బెడదతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల్లో ఫాగింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ అధికార ప్రతినిధి కూరెళ్ల విజయ్‌కుమార్, పట్టణ ప్రధానకార్యదర్శి గోగుల నాగరాజు, ఉపాధ్యక్షుడు గంగాధర స్వరాజ్, బొంత రమేష్, భూతం వెంకటయ్య, అందెం తిరుపతయ్య గౌడ్, జంపాల చంద్రశేఖర్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రాధాన్యత కల్పించాలి

దేవరకొండ, ఆగస్టు 4: ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులను ఇచ్చి తగిన ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ డిమాండ్ చేశారు. దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు, హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. వృద్ధ కళాకారులకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగనున్న ప్రజా కళాకారుల పండుగను విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, కళాకారులు రొయ్య రాములు, సైదులు, వెంకటయ్య, జ్యోతి, జయమ్మ, సంపతమ్మ, లాలమ్మ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకం'

నల్లగొండ క్రైం, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమని, మనువాద శక్తులంతా కలిసి ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇచ్చేలా చేశాయని ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, వివిధ మాల సంఘాల నాయకులు, జాతీయ మాల మహానాడు నాయకులు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ విశ్రాంత భవన్‌లో ఆ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు నుంచి వెలువడిన వర్గీకరణ తీర్పును రాజ్యాంగ వ్యతిరేకంగా ఉందని భావిస్తున్నామన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మాలలు, మాల సంఘాల, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 7,8,9,10 తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రేకల సైదులు, తెలగమల్ల యాదగిరి, అద్దంకి రవి, చింతపల్లి లింగమయ్య, గండమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం'

నల్లగొండరూరల్, ఆగస్టు 4: కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలతోనే సాధ్యమవుతుందని టీజీఎస్‌ఆర్టీసీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగయ్య, ఈదురు వెంకన్న అన్నారు. పట్టణంలోని మగ్దూం భవన్‌లో జరిగిన టీజీఎస్‌ఆర్టీసీ మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల కాలంలో గత ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. యూనియన్ ప్రాతినిధ్యం లేకుండా కార్మికుల హక్కులను సాధించుకోలేమని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ చేసే కార్మికుల హక్కుల రక్షణ, సంక్షేమం కోసం చేసే పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు పాపారావు, దేవేందర్‌రెడ్డి, స్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛదనం - పచ్చదనం

దేవరకొండ, మిర్యాలగూడ టౌన్, డిండి, కేతేపల్లి, కట్టంగూరు, శాలిగౌరారం, ఆగస్టు 4: జిల్లాలో ప్రభుత్వం ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. ఆదివారం నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. మొక్కలు నాటడంతో పాటు పారిశుధ్యాన్ని మెరుగుపరిచే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని సూచించారు.

● దేవరకొండలో ప్రజాప్రతినిధులు, అధికారులతో ర్యాలీ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

● మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కౌన్సిల్ సభ్యులు పాల్గొంటారని మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ తెలిపారు.

● డిండి, కేతేపల్లి, కట్టంగూరు, శాలిగౌరారం మండలాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవోలు డానియేల్, బి.శ్రీనివాసరావు, జ్ఞానప్రకాశ్‌రావు, జ్యోతి లక్ష్మి కోరారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నేపథ్యంలో కేతేపల్లిలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

స్నేహితుల దినోత్సవం..అపూర్వ సమ్మేళనం


కనగల్‌లో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న 1990-91 బ్యాచ్ విద్యార్థులు


చింతపల్లి: వెంకటేశ్వరనగర్(మాల్)లోని జడ్పీ హైస్కూల్‌కు చెందిన 2002-03 బ్యాచ్ విద్యార్థులు


దామరచర్ల సమ్మేళనంలో పాల్గొన్న 2007- 08 బ్యాచ్ విద్యార్థులు

చిట్యాలరూరల్, నల్లగొండ క్రైం, దేవరకొండ, చింతపల్లి, కనగల్, దామరచర్ల, నిడమనూరు, ఆగస్టు 4: పేద, ధనిక కుల, మతంలేనిది స్నేహమేనని పలువురు పేర్కొన్నారు. జిల్లాలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. జీవితంలో ఎన్ని అనుభూతులు ఉన్నా స్నేహం మాత్రమే గొప్ప మధురమైనదని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ కోటగిరి రామకృష్ణ అన్నారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా 2011 నుంచి నేటి వరకూ వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ అధ్యక్షులుగా పనిచేసిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో కాసం శేఖర్, నూనె కిషోర్ కుమార్, తల్లం గిరీష్, మిర్యాల మహేష్, మంచికంటి సత్యనారాయణ, సంతోష్, కృష్ణ పాల్గొన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, డాక్టర్ రవిప్రకాష్, సభ్యులు శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, ఉమమహేశ్వర్, రాపోలు నిరంజన్, మోహన్‌రావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పలుచోట్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలను నిర్వహించారు.


దేవరకొండలో ఫ్రెండ్‌షిప్ డే సంబురాలు


కట్టంగూరు: సమ్మేళనంలో పాల్గొన్న చైతన్య ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం : బీఎల్ఆర్


ముల్కలకాల్వ మేజర్ కాల్వ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 4: రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులను పరిష్కరిస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని వజీరాబాద్, ముల్కలకాల్వ మేజర్ కాల్వల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. రైతులకు ఇటీవ రుణమాఫీ చేసి వారికి ఆర్థికంగా చేయూతనందించిందన్నారు. అదేవిధంగా రైతుల సూచనల మేరకు రైతుభరోసా అందించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వరుణుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఎగువ నుంచి భారీగా నీరు ప్రాజెక్టుల్లోకి వచ్చి చేరడంతో జలాశయాలు కళకళలాడుతున్నాయని అన్నారు. జిల్లాలో రైతుల సాగు నీటి ఇబ్బందులను తీర్చడానికి ఎడమకాల్వ ద్వారా చెరువులను నింపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత పింఛన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్సీ అల్లుబెలి నర్సిరెడ్డి

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 4: ప్రభుత్వం పాత పింఛన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సీపీఎస్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని అన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు పాత పింఛన్ విధాన అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. సీపీఎస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ నూతన పింఛన్ విధానం అమలైన తర్వాత ఎంతోమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు మృతి చెందగా వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులు అనేత ఇబ్బందులు పడుతున్నారని, ఆర్థిక, ఆరోగ్య భద్రత లేక ఆయా కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. ఇటవల మృతి చెందిన సీపీఎస్ ఉద్యోగి ఎద్దు ఉపేంద్రం అంత్యక్రియలకు చందాలు వేసుకోవడం అందుకు ఉదాహరణ అన్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తరుణంలో సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ. 3లక్షలను ఉపేంద్రం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి వారి జీవితాల్లో ఆనందం నింపిన సీఎం రేవంత్‌రెడ్డి సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్, రాష్ట్ర కోశాధికారి ఈడిగ నరేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు, సురేందర్‌సింగ్, బాలూనాయక్, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, పంకజ్‌రెడ్డి, విజయ్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ బలోపేతానికి కృషి


స్వామిని సన్మానిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 4: కాంగ్రెస్ ఎస్సీసెల్ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎస్సీసెల్ నూతన అధ్యక్షుడు బోడ స్వామి అన్నారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎస్సీసెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన బోడ స్వామిని పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ పాత కమిటీలన్నింటిని రద్దు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయి జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. సమావేశంలో పెరిక హరిప్రసాద్, బోడ ప్రభాకర్, పెరిక అంజయ్య, ఇరుగు మధు, కురుపాటి గణేష్, పెరిక మహేష్, మేడి శ్రీను, కుడుతాల నాగరాజు, చిరుమర్తి శ్రీను, పల్లా రవితేజ పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం చూపిన జానారెడ్డి


జానారెడ్డిని సన్మానిస్తున్న రైతులు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 4: ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి పరిష్కారం చూపుతున్నారని పలువురు రైతులు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం సాగర్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ సమస్యలపై పైలట్ ప్రాజెక్టుగా మండలాన్ని ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మెరావత్ మునినాయక్, మాజీ ఎంపీటీసీలు శౌరినాయక్, హచ్చునాయక్, బీలునాయక్, నాయకులు నాగేందర్, బిచ్చాలు, సోమ్యతావు, బుజ్జి, రామారావు, కన్నయ్య, రమేష్, రాజా పాల్గొన్నారు.

కాల్వల పూడికతీత పనులు ప్రారంభం


పూడికతీత పనులను ప్రారంభిస్తున్న లక్ష్మయ్య, రమేష్

నల్లగొండ రూరల్, ఆగస్టు 4: మండలంలోని డి 39, డి 40 కాల్వల పూడిక తీత పనులను మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ ప్రారంభించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పనులు ప్రారంభించినట్లు వారు తెలిపారు. మంత్రి వెంకట్‌రెడ్డి హామీ మేరకు ఆయన సొంత నిధులతో పూడికతీత పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డి 39, డి 40 కాల్వలను ప్రారంభించారని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో కాల్వల్లో పూడిక తీయకపోవడంతో చివరి రైతులకు నీరందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. రైతుల విన్నపం, ఎన్నికల హామీ మేరకు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మంత్రి వెంకట్‌రెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా సొంత నిధులతో కాల్వల పూడికతీత పనులను చేపట్టి రైతు బాంధవుడుగా నిలిచారని కొనియాడారు. గత ప్రభుత్వానికి రైతులు పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కాల్వల ద్వారా ఖాజీరామారం, తానేదార్‌పల్లి, కంకణాలపల్లి, జంగారెడ్డిగూడెం, రామలింగాలగూడెం గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్తినేని శ్యాంసుందర్, దొంతినేని నాగేశ్వరరావు, కొల్లు శ్రీనివాస్‌రెడ్డి, కిన్నెర అంజి, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, షబ్బీర్ బాబా, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

పబ్లిక్ ఎజెండా

public agenda

మురికి నీటిని మళ్లించండి : నార్కట్‌పల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో ఇళ్లల్లోని మురికినీరంతా శ్మశానవాటికకు చేరి ఆ నీటిలో గోరీలు తేలియాడుతున్నాయని, గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా తీసుకువచ్చి శ్మశానవాటికలో పడవేస్తూ డంపింగ్ యార్డులా మార్చారని గ్రామ దళితులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. శ్మశానవాటికను ముంచేస్తున్న మురికినీటిని మళ్లించేందుకు ప్రత్యామ్నాయ చర్యలను తక్షణమే చేపట్టాలని కోరారు.

బేబీ ఫీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలి : నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో తమ శిశువులకు పాలిచ్చేందుకు బేబీ ఫీడింగ్ రూం (పిల్లలకు తల్లులు పాలిచ్చే క్యాబిన్ లాంటి ప్రత్యేక బూత్) లేక చంటి పిల్లల తల్లులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్‌కు వచ్చే బాలింతలు, చంటి పిల్లల తల్లులు తమ శిశువులకు బహిరంగ ప్రదేశంలో పాలిచ్చేందుకు కొంత సిగ్గుపడాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు లేక స్వచ్ఛంద సంస్థలు గుర్తించి బస్టాండ్‌లో బేబీ ఫీడింగ్ బూత్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలి : చింతపల్లి: మండలంలోని పోలేపల్లిరాంనగర్, మదనాపురం, పాలెంతాండ, బోటిమీదితాండ, తక్కళ్లపల్లి, ఉమ్మాపురం, కిషన్‌పల్లి, హోమంతాలపల్లి, తిరుమలపురం, బద్దవారిగూడెం, బట్టుగూడెం, ఉప్పరపల్లి, తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం వెంకటేశ్వరనగర్‌కు రావాల్సి ఉంది. బస్సులు లేకపోవడంతో ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యాన్నదాన సత్రానికి భోజన సరఫరా ట్రాలీ బహూకరణ

నార్కట్‌పల్లి, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన సత్రానికి ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన స్నేహితులు వడ్డే శివశంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పట్ల లింగయ్య, కమటాల స్వామి, బొడ్డుపల్లి శ్రీహరి భోజన సరఫరా ట్రాలీ (ఫుడ్ సర్వీస్ ట్రాలీ)ని ఆదివారం బహూకరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు సౌకర్యార్థం సుమారు రూ.20 వేలతో ట్రాలీని చేయించి నిత్యాన్నదానం సత్రం ఇన్‌చార్జి వల్లూరి శంకర్‌కు అందజేశారు.

బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి

శాలిగౌరారం, ఆగస్టు 4: శాలిగౌరారం మండల కేంద్రంలో బాలుర బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 24 గ్రామాలు, 12 ఆవాస గ్రామాల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు స్థానికంగా గురుకుల పాఠశాల లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి శాలిగౌరారంలో బాలుర బీసీ గురుకుల పాఠశాలను వెంటనే మంజూరు చేయాలని మల్లయ్య కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హాలియా, ఆగస్టు 4: మండలంలోని యాచారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్నందున యాచారం ఫీడర్ కింద సోమవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు యాచారం గ్రామానికి, ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధిలో అన్నారం, మారేపల్లి గ్రామాల పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు హాలియా విద్యుత్ ఏఈ బాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు 11 కేవీ మారేపల్లి ఫీడర్ బ్రేకర్ మరమ్మతులు ఉన్నందున మారేపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో వజ్రతేజ రైస్‌మిల్లు దగ్గరలో 400 కేవీ కొత్త లైను వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపేట ఫీడర్ పరిధిలో ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు 8 రోజులు ప్రతీ రోజూ మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు వ్యవసాయ రైతుల ట్రాన్స్‌ఫార్మర్లకు కరెంటు నిలిపివేయనున్నట్లు ఏఈ బాలు తెలిపారు. కావున విద్యుత్ గృహ, వాణిజ్య, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఇంపాక్ట్ క్లబ్ రీజనల్ ప్రెసిడెంట్‌గా నూనె సుదర్శన్


నియామక పత్రం అందుకుంటున్న సుదర్శన్

నిడమనూరు, ఆగస్టు 4: ఇంపాక్ట్ ఫౌండేషన్ క్లబ్ రీజనల్ అధ్యక్షుడిగా మోటివేషనల్ స్పీకర్, మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం పాఠశాల ఉపాధ్యాయుడు నూనె సుదర్శన్ ని యమితులయ్యారు. హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మూడు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ఆయన్ను నియమిస్తూ తీర్మానం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంపా నాగేశ్వర్‌రావు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను మోటివేట్ చేస్తూ వారిని ఉన్నత లక్ష్యాల వైపు పరుగెత్తే విధంగా ప్రేరణ కల్పిస్తానన్నారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల రీజనల్ అధ్యక్షుడిగా తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: బాధ్యత గల ఉద్యోగులుగా సేవలందించినపుడే ప్రజల్లో చిరస్మరణీయ గుర్తింపు లభిస్తుందని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుంధతీరెడ్డి అన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిగా తనతో పాటు సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళ్తున్న సిబ్బందికి నిర్వహించిన వీడ్కోలు సన్మాన సభలో ఆమె మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి వృత్తి ధర్మాన్ని నెరవేర్చడంలో సిబ్బంది సేవలను ఆమె కొనియాడారు.

నార్కట్‌పల్లి: బీజేపీ గ్రామశాఖ సౌజన్యంతో మండలంలోని ఎం.ఎడవల్లిలో సిమెంట్ బెంచ్‌లను బహూకరించారు. గ్రామంలోని పలు కూడళ్లలో వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు జాల శంకర్‌ప్రసాద్, రాజేందర్‌రెడ్డి, సతీష్, శ్రీకాంత్, ఉపేందర్, సందీప్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని అన్నారు. తల్లిపాల వారోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, అమరావతి, నాగలక్ష్మి, యాదమ్మ పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: పుట్టిన బిడ్డకు తల్లి పాలు శ్రేష్టమని, ప్రతీ ఒక్కరు తల్లిపాలు బిడ్డకు పట్టించాలని బుద్ధారం అంగన్‌వాడీ టీచర్లు సుమలత, సత్తమ్మ, కార్యదర్శి లక్ష్మి అన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కల్పించారు.

మిర్యాలగూడ టౌన్: ఆధ్యాత్మిక చింతనతో నూతనోత్తేజం లభిస్తుందని ధర్మ జాగరణ సమితి జిల్లా సంయోజక్ నందుల లక్ష్మీనర్సింహశాస్త్రి అన్నారు. పట్టణంలో నిత్యపూజా విధానంపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. సుసమాజ నిర్మాణంలో మహిళలది కీలకపాత్రని, మహిళలు మానసికంగా శక్తివంతంగా తయారవ్వాలంటే దైవారాధన అవసరమని అన్నారు.

చిట్యాల: చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డులోని కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు వెడల్పు వంటి సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వీరేశానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిల్వేరు మౌనిక శేఖర్, దాసరి వెంకన్న, శ్రీకాంత్, రాజు, రవి, బిక్షం, జగదీశ్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిచెట్లను పలువురు యువకులు శ్రమదానంతో తొలగించారు. పక్కనే ఉన్న మంచినీటి ట్యాంకు వద్ద ఉన్న కంపచెట్లను తొలగించిన పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కాపర్తి బిక్షం, దార మనోజ్, సునీల్, నర్సింహ, బన్నీ, సందీప్, జయరాజ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ: రాత్రి సమయంలో ఎక్కువ సేపు హోటళ్లు తెరిచి ఉంచేలా అవకాశం కల్పించాలని బైపాస్ హోటళ్ల నిర్వాహకులు ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను కోరారు. రాత్రి 10 గంటలకే హోటళ్లను మూసివేయిస్తున్నారని, కస్టమర్లపై లాఠీచార్జీ చేస్తున్నారని ఫాస్ట్‌ఫుడ్ హోటల్స్ యజమానులు మోసిన్, జలగం వసంత్ ఆరోపించారు. రాత్రి సమయంలో ఎక్కువ సేపు తెరిచి ఉంచే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మధు, పాపయ్య, సుబ్రహ్మణ్యం, చింటుయాదవ్, అశోక్ పాల్గొన్నారు.

మర్రిగూడ: రుణమాఫీ పథకం రైతులకు సంతోషాన్ని కలిగించిదని సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్ అన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని అన్నారు.

హాలియా: ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చదివే నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ భవిష్యవాణి లాంటిందని ఏకే ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

చిట్యాలరూరల్: మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో ఆసరా స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ మేడి హరికృష్ణ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, విద్యా సామగ్రి, అక్షరమాల చార్టులను బహూకరించారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, నాగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అధికారికంగా విస్తృతంగా పర్యటించనున్నారు. చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, మునుగోడు మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సంబంధిత శాఖాధికారులు తెలిపారు.

కట్టంగూరు: ఆసిఫ్‌నగర్ కాల్వ ద్వారా మూసీ నీటితో చెరువులు, కుంటలను నింపాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్లేబోయిన యాదగిరి కోరారు. ఆసిఫ్‌నగర్ కాల్వ ద్వారా చెరువులు, కుంటలు నింపితే భూగర్భ జలాలు పెరిగి రైతాంగానికి లాభం చేకూరుతుందన్నారు.

కనగల్: మండలంలోని పొనుగోడు గ్రామంలో సవార్ల పండగలో భాగంగా పీర్ల ఊరేగింపును నిర్వహించారు. ఆల్‌హుస్సేన్, షైబూ, చినకాశీం, పెదకాశీం సవార్లకు గ్రామస్థులు దట్టీలు కట్టి కట్నకానుకలు, బెల్లం, మరమరాలను సమర్పించుకున్నారు. అనంతరం పీర్లకొట్టం వద్ద నిర్వహించిన అల్వా వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం సవార్లను సమీప బావిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెరుగు శివయ్య, మాజీ ఎంపీటీసీ అండాలువెంకటేశం, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రానికి చెందిన రాచకొండ రమేష్ ఎమ్మెల్యే వీరేశంను కోరారు.

మర్రిగూడ: మండలంలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, నాయకులు లింగారెడ్డి, యాదయ్య, మల్లేష్, గణేష్, ముత్యాలు, రవి, రవి పాల్గొన్నారు.

మర్రిగూడ: కేంద్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని రైతు సంఘం మండల కార్యదర్శి బుర్ర శేఖర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కాగితాలను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్, కృష్ణయ్య, అంజయ్య, లింగయ్య పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని జీఎడవల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థి కొప్పుల అనిల్ చదువుకు అయ్యే ఖర్చుల నిమిత్తం ఎస్ఎల్ఎన్ వ్యవస్థాపకులు నాతి లక్ష్మీనర్సింహ, శ్రీనివాసులు రూ.1.10లక్షలు ఆర్థికసాయం అందజేశారు. అనిల్ ఖమ్మంలో ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతుండగా కళాశాల, హాస్టల్ ఫీజు కట్టలేక కొద్దిరోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి నాతి గణేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.